సాక్షి యాదాద్రి భువనగిరి

ఆదివారం । 27 । జూలై । 2025



ప్రేమను పంచుదాం..
పిల్లల పెంపకంలో తల్లిదండ్రుల పాత్ర కీలకం. ప్రేమగా చూసుకుంటూ క్రమశిక్షణగా పెంచడమూ ముఖ్యమే. - 8లో



అధిక స్థానాలు గెలుచుకుంటాం
స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు గెలుచుకుంటామని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. - 9లో



అతివేగమా.. నిద్రమత్తా!
కైతాపురం జంక్షన్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు పోలీస్ అధికారులు దుర్మరణం చెందారు. - 10లో

● కార్గిల్ విజయ్ దివస్



కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకొని శనివారం భువనగిరి పట్టణంలో కాగడాలతో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేవైఎం నాయకులు



ఆండాళ్‌దేవికి తిరునక్షత్ర పూజలు చేసి పాశురాలు పఠిస్తున్న అర్చకులు



ఉత్సవమూర్తులకు అష్టోత్తర పూజలు చేసి హారతినిస్తున్న అర్చకుడు

వైభవంగా ఆండాళ్ తిరునక్షత్రోత్సవం

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఆండాళ్ అమ్మవారి తిరు నక్షత్రోత్సవాలకు అర్చకులు శనివారం శ్రీకారం చుట్టారు. ఉదయం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి సాయంత్రం సేవాకాలం ప్రారంభించారు. అనంతరం అమ్మవారికి ఇష్టమైన నైవేద్యం సమర్పించారు. సోమవారంతో తిరునక్షత్ర వేడుకలు ముగియనున్నాయి.

ప్రధానాలయంలో నిత్యారాధనలు

ప్రధానాలయంలో సంప్రదాయ పర్వాలు యథావిధిగా కొనసాగాయి. వేకువజామున స్వామివారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ చేపట్టిన అర్చకులు.. గర్భాలయంలోని స్వయంభూలు, ప్రతిష్ఠా అలంకారమూర్తుకు అభిషేకం చేసి, సహస్రనామార్చనలతో కొలిచారు. అనంతరం ప్రథమ ప్రాకార మండపంలో సుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, ఉత్సవమూర్తులకు నిత్యకల్యాణం, ముఖమండపంలో బ్రహ్మోత్సవం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి స్వామివారికి శయనోత్సవం చేసి ఆలయ ద్వారబంధనం చేశారు.

న్యూస్‌రీల్

అత్యవసర పనులకు రూ.కోటి నిధులు

భువనగిరి టౌన్: భారీ వర్షాల కారణంగా ఆస్తి, ప్రాణ నష్టం జగరకుండా ఉండటంతో పాటు ఇతర అత్యవసర పనుల నిమిత్తం ముందస్తు చర్యల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు రూ.కోటి విడుదల చేసింది. ఈ నిధులను డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్ విభాగా నికి కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

నారాయణపురం పోలీస్ స్టేషన్‌లో సీపీ తనిఖీ



ఎస్ఐతో మాట్లాడుతున్న సీపీ సుధీర్‌బాబు

సంస్థాన్‌నారాయణపురం: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను రాచకొండ సీపీ సుధీర్‌బాబు శనివారం తనిఖీ చేశారు. కేసుల పు రోగతి, పెండింగ్ కేసుల వివరాలతో పాటు స్టేషన్‌లో సమస్యలపై ఎస్ఐ జగన్‌ను అడిగి తెలుసుకున్నారు. మౌలిక వసతులపై ఆరా తీశారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. సమస్యలను తన దృష్టికి తెస్తే పరిష్కరిస్తానన్నారు.

నేడు గ్రామ పాలన అధికారుల రాత పరీక్ష

భువనగిరిటౌన్ : గ్రామ పాలన అధికారుల రెండో స్పెల్ స్క్రీనింగ్ టెస్ట్ ఆదివారం జరగనుంది. ఇందుకోసం భువనగిరి శివారులోని రేణుకా ఎల్లమ్మ ఆలయం వద్ద ఉన్న వెన్నెల కళాశాలలో ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షకు 37 మంది హాజరుకానున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష జరగనుంది. అభ్యర్థులు నిర్దేశిత సమయానికి గంట ముందు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని కలెక్టర్ హనుమంతరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్ష సమయంలో కేంద్రం చుట్టుపక్కల జిరాక్స్ సెంటర్లను మూసివేయించాలని, అభ్యర్థులను తనిఖీ చేసి సెంటర్‌లోకి పంపాలని ఆయన పేర్కొన్నారు.

ఓపెన్ టెన్త్‌లో అడ్మిషన్లు పెంచాలి



అదనపు కలెక్టర్‌తో సమావేశమైన సహాయ సంచాలకులు, అధికారులు

భువనగిరి: ఓపెన్ టెన్త్‌లో అడ్మిషన్లు పెంచాలని తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ రాష్ట్ర సహాయ సంచాలకులు సోమిరెడ్డి కోరారు. శనివారం అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు, డీఆర్‌డీఓ నాగిరెడ్డిని కలెక్టరేట్‌లో కలిశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. చదువు మధ్యలో మానివేసిన వారిని గుర్తించి ఓపెన్ స్కూల్‌లో చేర్పించేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. 2025–26 విద్యా సంవత్సరానికి యాదాద్రి జిల్లాలో ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో 4వేల ప్రవేశాలు కల్పించాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారి పెసరు లింగారెడ్డి, ఓపెన్ స్కూల్‌ప్రతినిధి నితిన్‌ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు.

బీబీనగర్ పీహెచ్‌సీలో డీపీటీ వ్యాక్సిన్ కొరత

బీబీనగర్: ఐదేళ్ల పైబడిన చిన్నారుల్లో పోలియో నివారణకు ఇచ్చే డీపీటీ వ్యాక్సిన్ బీబీనగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నెల రోజులుగా అందుబాటులో లేదు. దీంతో చిన్నారులకు ఇబ్బందికర పరిస్థితి ఏర్పడుతుంది. వ్యాక్సిన్ కోసం వారం రోజుల క్రితం ఆస్పత్రికి వచ్చిన చిన్నారుల ఆధార్‌కార్డు నంబర్లను సిబ్బంది నమోదు చేసుకున్నారు. శనివారం రావాలని సూచించడంతో తల్లిదండ్రులు చిన్నారులను స్కూల్స్ మానిపించి పీహెచ్‌సీకి తీసుకువచ్చారు. తీరా వ్యాక్సిన్ లేదని చెప్పడంతో వారు వైద్యసిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఖరారైన పరిహారం.. చెల్లింపులో జాప్యం!

అందుబాటులోకి రాని భూరాశి పోర్టల్

- పోర్టల్‌లో భూ నిర్వాసితుల వివరాల నమోదు తప్పనిసరి
- దీని ఆధారంగానే పరిహారం చెల్లింపు
- అదనపు కలెక్టర్‌కు లాగిన్ ఇవ్వకపోవడంతోనే ఈ పరిస్థితి
- నిర్వాసితులు నష్టపోకుండా వడ్డీతో కలిపి చెల్లించేందుకు కసరత్తు



ఐదు గ్రామాల పరిధిలో సేకరణ పూర్తి

తుర్కపల్లి, యాదగిరిగుట్ట, వలిగొండ, చౌటుప్పల్ మండలాల్లోని 18 గ్రామాల పరిధిలో 1,288.35 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది. ఐదు గ్రామాల్లో భూ సేకరణ పూర్తి కాగా 411 ఎకరాలకు అవార్డ్ పాస్ కావడంతో ఫిబ్రవరి నాటికి పరిహారం ఖరారు చేశారు.

సాక్షి, యాదాద్రి : రీజినల్ రింగ్‌రోడ్డు భూ నిర్వాసితులకు పరిహారం చెల్లింపులో జాప్యం జరుగుతోంది. సేకరించిన భూములకు పరిహారం ఖరారు చేసి నాలుగు నెలలు గడిచినా నిర్వాసితుల ఖాతాల్లో నగదు జమ చేయడం లేదు. భూరాశి పోర్టల్‌లో భూ నిర్వాసితుల వివరాలు నమోదు చేయకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడింది. రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి జిల్లా పరిధిలో 1,288.35 ఎకరాల భూమి సేకరించాల్సి ఉంది. ఇప్పటి వరకు సేకరించిన భూముల్లో 411 ఎకరాలకు ఫిబ్రవరిలో పరిహారం ఖరారైంది.

పోర్టల్ అందుబాటులోకి వస్తేనే..

రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణంలో భూములు, ప్లాట్లు, ఇతర ఆస్తులు కోల్పోతున్న నిర్వాసితుల వివరాలను తప్పనిసరిగా కేంద్ర ప్రభుత్వానికి చెందిన భూరాశి పోర్టల్‌లో నమోదు చేయాలి. దీని ఆధారంగా నిర్వాసితులకు పరిహారం చెల్లిస్తారు. రెవెన్యూ విభాగం అదనపు కలెక్టర్‌కు పోర్టల్ లాగిన్ ఇస్తారు. కానీ, సాంకేతికపరమైన సమస్యల వల్ల ఇప్పటి వరకు అదనపు కలెక్టర్‌కు భూరాశి పోర్టల్ లాగిన్ ఇవ్వలేదు. భూములు, స్ట్రక్చర్ వ్యాల్యూ వివరాలను రెవెన్యూ అధికారులు ఫిబ్రవరిలోనే నేషనల్ హైవే సంస్థకు అందజేశారు. రైతుల వ్యక్తిగత ఖాతా, బ్యాంక్ పాస్‌బుక్, ఆధార్‌కార్డు తదితర వివరాలను భూరాశి పోర్టల్‌లో పొందుపర్చాలి. జిల్లా అధికారికి పోర్టల్ లాగిన్ ఇవ్వకపోవడంతో పరిహారం చెల్లింపులో జాప్యం జరుగుతోంది.

భూముల వివరాలు (ఎకరాల్లో)

గ్రామం	నోటిఫై చేసిన భూములు	అవార్డు పాస్
దాతరుపల్లి	96	6.28
మల్లాపూర్	33	0.38
వేల్పల్లి	86.38	5.13
దత్తాయపల్లి	75.32	3.06
ఇబ్రహీంపూర్	46.08	6.35
కోనాపూర్	47.38	3.30
వీరారెడ్డిపల్లి	118.22	---
లింగోజిగూడెం	1.345	1.345
చౌటుప్పల్	145.12	----
తాళ్లసింగారం	65.035	65.035
చిన్నకొండూరు	84.35	8.09
నేలపట్ల	80.145	10.15
తంగడపల్లి	14.31	14.31
పహిల్వాన్‌పూర్	110.245	97.27
గోకారం	34.03	34.03
పొద్దటూరు	99.175	5.255
వర్కట్‌పల్లి	44.115	44.12
రెడ్లరేపాక	103.29	102.17

వడ్డీతో చెల్లించేందుకు కసరత్తు

411 ఎకరాలకు పరిహారం రూ.75.19 కోట్లు చెల్లించాల్సి ఉంది. జాప్యం జరగడంతో నిర్వాసితులు నష్టపోకుండా 4 నెలల కాలానికి 12 శాతం వడ్డీ కలిపి పరిహారం చెల్లించనున్నారు. హైవే అధికారుల సూచన మేరకు రెవెన్యూ అధికారులు లెక్కలు వేస్తున్నారు.

తనిఖీలు.. హెచ్చరికలు.. నోటీసులు

- కలెక్టర్ క్షేత్రస్థాయి విజిట్‌లు
- దత్తాయపల్లిలో పాఠశాల, ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన
- గుట్ట పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీ



దత్తాయపల్లి పాఠశాలలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

తుర్కపల్లి: కలెక్టర్ హనుమంతరావు శనివారం వివిధ ప్రాంతాల్లో క్షేత్ర పర్యటనలతో బిజీగా గడిపారు. మధ్యాహ్నం దత్తాయిపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్లను పరిశీలించారు. కొత్త అడ్మిషన్లపై హెచ్‌ఎంను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం భోజనాన్ని రుచి చూశారు. విద్యార్థులకు స్వయంగా భోజనం వడ్డించడంతో పాటు పాఠశాలలో సౌకర్యాలు, సమస్యలపై ఆరా తీశారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని, పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని ఉపాధ్యాయులకు, వంట నిర్వాహకులకు సూచించారు. కలెక్టర్ వెంట హెచ్‌ఎం, ఉపాధ్యాయులు ఉన్నారు. అనంతరం గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి ఇసుక, స్టీల్, సిమెంట్ ధరలపై ఆరా తీశారు. కొన్ని ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోవడంతో అందుకు కారణాలు తెలుసుకున్నారు. మూడు రోజుల్లో తిరిగి పనులు ప్రారంభించాలని లబ్ధిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గీతారెడ్డి, పంచాయతీ కార్యదర్శి నర్సింహ, కారోబార్ స్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గుట్ట పీహెచ్‌సీలో ఇద్దరికి నోటీసులు

యాదగిరిగుట్ట: పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. వైద్యసిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైన సీనియర్ అసిస్టెంట్, ల్యాబ్ టెక్నీషియన్‌కు నోటీసులు జారీ చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. రోజువారీ ఓపీ సంఖ్యపై ఆరా తీశారు. అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని, లేకపోతే వెంటనే ఇండెంట్ పెట్టి తెప్పించుకోవాలని వైద్యాధికారి విలియంకేరీని ఆదేశించారు.



యాదగిరిగుట్ట పీహెచ్‌సీలో రోగితో మాట్లాడి సమస్య తెలుసుకుంటున్న కలెక్టర్

హ్యామ్‌లో చిట్యాల-భువనగిరి రోడ్డు

- తొలి దశలో కల్వర్టులు, వంతెనల నిర్మాణం, ప్రమాదాల నివారణకు చర్యలు
- ప్రభుత్వానికి డీపీఆర్ పంపిన ఆర్‌అండ్‌బీ
- ఆమోదం పొందగానే పనుల నిర్వహణకు టెండర్లు

రామన్నపేట: నిత్యం త్యం రద్దీగా ఉండే చిట్యాల–భువనగిరి రోడ్డుకు మంచి రోజులు రానున్నాయి. ఈ రహదారిని హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (హ్యామ్)లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. భువనగిరి నుంచి చిట్యాల జాతీయ రహదారి వరకు 43.3 కిలో మీటర్ల పొడవున రహదారి ఉంది. ఇది నల్లగొండ, యాదాద్రి జిల్లా కేంద్రాలకు వారధిగా ఉంది. విజయవాడ, వరంగల్, రాజీవ్ రహదారులను కలుపుతుంది. ఈ మార్గంలో ప్రయాణించడం వల్ల సమయంతోపాటు, ఇందనం ఆదా అవుతుండడంతో వాహనదారులు ఈ మార్గం గుండా వెళ్లడానికి మొగ్గు చూపుతున్నారు. గడిచిన పదేళ్లలో వాహనాలరద్దీ రెండున్నర రెట్లు పెరిగింది. ఆర్‌అండ్‌బీ 2011 గణంకాల ప్రకారం ఆర్టీసీ బస్సులు, బైక్‌లు కాకుండా రోజుకు 2 వేల కమర్షియల్ వాహనాలు తిరిగేవి. ప్రస్తుతం వాటి సంఖ్య 5 వేల పైన ఉంటుంది. వాహనాల రద్దీకి తగ్గట్లు రోడ్డును విస్తరించకపోవడం మూలంగా వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురి అవుతున్నారు.

మూల మలుపులతో పరేషాన్

చిట్యాల నుంచి భువనగిరిల మధ్య 30 పైగా మూలమలుపులు ఉన్నాయి. మలుపుల వద్ద ప్రమాదాల నివారణకు చేపట్టిన చర్యలు నామమాత్రమే. 2015 అక్టోబర్ 7న ఇంద్రపాలనగరం శివారులోని మూలమలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో 10మంది మృత్యువాత పడ్డారు.



రామన్నపేట శివారులో ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు

రోడ్డు అభివృద్ధికి బాటలు

రాష్ట్రంలోని పలు రోడ్లను హ్యామ్‌లో అభివృద్ధి చేయాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా చిట్యాల–భువనగిరి రోడ్డును మొదటి దశకింద ఎంపిక చేసింది. ఆర్‌అండ్‌బీ అధికారులు డీపీఆర్ సిద్ధం చేసి ప్రభుత్వానికి అందజేశారు. డీపీఆర్ ఆమోదం పొందిన వెంటనే టెండర్లు పిలువనున్నారు. మొదటి దశలో రోడ్డును బలోపేతం చేయడం, అవసరమైన చోట కల్వర్టులు, వంతెనలు నిర్మించడంతో పాటు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు చేపడతారు. రెండవ దశలో రోడ్డును నాలుగులేన్లుగా విస్తరించే అవకాశం ఉన్నది.

ప్రతిపాదనలు పంపాం

చిట్యాల–భువనగిరి రోడ్డును హ్యామ్‌లో మొదటి ప్రాధాన్యతగా ఎంపిక చేయడం జరిగింది. రోడ్డు అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు పంపడం జరిగింది. డీపీఆర్ రిపోర్ట్ ఫైనల్ కాగానే టెండర్లు పిలిచి పనులను ప్రారంభించే అవకాశం ఉన్నది.

–నవీన్, ఆర్‌అండ్‌బీ ఏఈఈ

ఫేస్ రికగ్నేషన్‌తో పింఛన్ల పంపిణీ

- అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

భువనగిరిటౌన్ : ఆసరా పింఛన్లను ఆగస్టునుంచి ఫేస్ రికగ్నేషన్ విధానం ద్వారా పంపిణీ చేయనున్నట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, వార్డు ఆఫీసర్లు, బ్రాంచ్ పోస్టుమాస్టర్లకు శనివారం కలెక్టరేట్‌లో శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై నూతన విధానంపై పలు సూచనలు చేశారు. ఫేస్ రికగ్నేషన్‌కు కోసం రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ప్రత్యేక యాప్ రూపొందించిదన్నారు. లబ్ధిదారులు పింఛన్ తీసుకుకోవడానికి ముందు యాప్‌లో ముఖ హాజరు వేయాల్సి ఉంటుందన్నారు. ప్రస్తుతం ప్రతి నెలా 99,380 మంది ఆసరా లబ్ధిదారులు పింఛన్ తీసుకుంటున్నట్లు వెల్లడించారు. చాలా మంది వేలిముద్రలు సరిపోనందున పంచాయతీ కార్యదర్శులు, పోస్ట్ మాస్టర్లు, బిల్ కలెక్టర్ల ధ్రువీకరణతో పింఛన్ తీసుకుంటున్నారని చెప్పారు. ఈ విధానం లోపభూయిష్టంగా ఉందని, అక్రమాలు జరుగుతున్నాయనే ఫిర్యాదుల నేపథ్యంలో ప్రభుత్వం ఫేషియల్ రికగ్నేషన్ విధానం తీసుకువచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ నాగిరెడ్డి, యాదగిరిగుట్ట ఎంపీడీఓ నవీన్ కుమార్, కోఆర్డినేటర్లు హాజరయ్యారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

కలెక్టరేట్‌లో కంట్రోల్‌రూం

- వర్షాల నేపథ్యంలో ఏర్పాటు
- సంప్రదించాల్సిన నంబర్ **08685-293312**

భువనగిరిటౌన్ : వర్షాల నేపథ్యంలో కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. కంట్రోల్‌రూంలో ఏడు విభాగాల సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటారని, వరదలు, ఇళ్లకు నష్టం, చెట్లు కూలిపోవడం.. ఇలా ఎలాంటి సమస్యలు ఎదురైనా 08685–293312 నంబర్‌ను సంప్రదించాలని కలెక్టర్ హనుమంతరావు సూచించారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, అధికార యంత్రాంగానికి సహకరించాలని కోరారు. ఇదిలా ఉండగా అల్పపీడన ప్రభావంతో శనివారం కూడా పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది. ఆదివారం సైతం వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు.

ఎయిమ్స్‌లో ఫైబ్రో స్కాన్ సేవలు

బీబీనగర్: ఎయిమ్స్ వైద్య కళాశాలలో ఫైబ్రో స్కాన్ సేవలు అందుబాటులోకి వచ్చాయని, వీటిని ప్రజలు వినియోగించుకోవాలని ఎయిమ్స్ డైరెక్టర్ అహంతేం శాంతాసింగ్ పేర్కొన్నారు. ఫైబ్రో స్కాన్ ల్యాబ్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఫైబ్రో స్కాన్ చేయించుకుంటే ఫ్యాటీలివర్, హైపటైటిస్, సిరోసిస్ వంటి దీర్ఘకాలిక వ్యాధులను గుర్తించి నివారించడానికి అవకాశం ఉంటుందనఆనరు. త్వరలో మరికొన్ని ఆధునిక వైద్యసేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఆయన వెల్లడించారు.



ఫైబ్రో స్కాన్ ల్యాబ్ ప్రారంభోత్సవంలో ఎయిమ్స్ డైరెక్టర్, వైద్యులు

పల్లెల్లో స్వచ్ఛత ఎంత?

ఎంపిక చేసిన గ్రామాల్లో స్వచ్ఛ సర్వేక్షణ్ టీంల సర్వే

- అభివృద్ధి పనులు, మౌలిక సౌకర్యాలు, ప్రభుత్వ సంస్థల పనితీరుపై పరిశీలన
- 13 ప్రశ్నలపై ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్
- మార్కుల ఆధారంగా ర్యాంకు, జాతీయ పురస్కారానికి ఎంపిక

భువనగిరి : గ్రామాల్లో పారిశుద్ధ్యంపై కేంద్ర బృందాలు సర్వే నిర్వహిస్తున్నాయి. మరుగుదొడ్ల నిర్మాణం, వాటి వినియోగం, డ్రెయినేజీలు, ఇంకుడు గుంతలు, వైకుంఠధామాలు, పల్లె ప్రకృతి వనాలు, డంపింగ్ యార్డులు, ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలిస్తున్నాయి. వీటితో పాటు ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, మండల కేంద్రాల్లోని ప్రభుత్వ కార్యాలయాలను సందర్శిస్తున్నాయి. రోజువారీగా తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరిస్తున్నార? డ్రెయినేజీల్లో పూడికను ఎన్ని రోజులకు తీస్తున్నారు? మరుగుదొడ్లను ఉపయోగిస్తున్నారా లేదా? వ్యక్తిగత మరుగుదొడ్లు ఎన్ని ఉన్నాయి, ఇంకా ఎన్ని ఇళ్లలో నిర్మించాల్సి ఉన్నది? అనే అంశాలపై ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ సేకరిస్తున్నారు. ఫీడ్ బ్యాక్‌లో వచ్చిన మార్కుల ఆధారంగా గ్రామాలకు జాతీయ స్థాయిలో స్వచ్ఛ సర్వేక్షణ్–2025 ర్యాంకులు ప్రకటించి రాష్ట్రపతి చేతుల మీదుగా పురస్కాలు ప్రదానం చేస్తారు.



రాజాపేట మండలం పాముకుంట పాఠశాలలో వివరాలు సేకరిస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం

20 గ్రామాలు, రెండు బృందాలు

జిల్లాలో 17 మండలాలు 427 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ర్యాండమైజేషన్ పద్ధతిలో సర్వే చేసేందుకు 20 గ్రామాలను ఎంపిక చేశారు. ఎంపిక చేసిన గ్రామాల్లో సర్వే చేసేందుకు ఏఎంసీ సంస్థ ఆధ్వర్యంలో రెండు బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో సంస్థ ద్వారా నియమించిన వ్యక్తితో పాటు స్వచ్ఛ భారత్ మిషన్ కో ఆర్డినేటర్ ఉన్నారు. ఉదయం 8గంట నుంచి సాయంత్రం వరకు నిర్దేశించిన గృహాలు, ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల్లో సర్వే చేస్తున్నాయి. ఈనెల 18న సర్వే ప్రారంభం కాగా.. ఆగస్టు 4న ముగియనుంది. ఇప్పటి వరకు 13 గ్రామాల్లో సర్వే పూర్తయ్యింది.

రోజూ 18 నివాస గృహాలు, ఐదు కార్యాలయాల సందర్శన

స్వచ్ఛ సర్వేక్షణ్ టీంలు ఒక్కో గ్రామంలో పర్యటించి 16 గృహాలతో పాటు ఐదు ఇనిస్టిట్యూషన్స్‌ను సందర్శిస్తున్నాయి. ఇనిస్టిట్యూషన్స్‌లలో నాలుగు అంశాలను పరిశీలిస్తున్నాయి. గ్రామ పంచాయతీ కార్యాలయం, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మార్కెట్, ప్రార్థన ప్రదేశాల నిర్వహణను పరిగణలోకి తీసుకుంటున్నాయి. వీటితో పాటు ఇళ్లకు సంబంధించి మరుగుదొడ్ల నిర్వహణ, పరిశుభ్రత, చెత్త సేకరణ, మురుగు నీటి నిర్వహణ తీరును ప్రత్యక్షంగా పరిశీలిస్తున్నాయి. ఆయా అంశాలకు సంబంధించిన ఫొటోలను అక్కడికక్కడే మొబైల్ యాప్ ద్వారా అప్‌లోడ్ చేస్తున్నారు. మొత్తం 1000 మార్కులు ఉంటాయి. స్వచ్ఛత, నిర్వహణ తీరు ఆధారంగా మార్కులు కేటాయిస్తున్నారు.



మార్కుల కేటాయింపు ఇలా..

క్షేత్రస్థాయి పరిశీలన ఆధారంగా	540
మానవ వనరుల వినియోగం	240
వ్యర్థాల కేంద్రాల నిర్వహణ	120
పౌరుల అభిప్రాయ సేకరణ	100

ప్రజలు స్పందించాలి

జిల్లాలో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్–2025 సర్వే కొనసాగుతుంది.సర్వేలో రెండు బృందాలు పాల్గొంటున్నాయి. వివిధ శాఖల సమన్వయంతో ఇప్పటి వరకు మొబైల్ యాప్ ద్వారా 13 ప్రశ్నలకు గాను 15వేల మంది తమ అభిప్రాయాలను వెల్లడించారు. ప్రత్యక్షంగా సాగుతున్న సర్వేకు ప్రజలు ప్రతిస్పందించి పురస్కారం దక్కించుకునేందుకు తోడ్పాటునందించాలి.

–నాగిరెడ్డి, డీఆర్‌డీఓ

క్లుప్తంగా

సూక్ష్మకళాకారుడికి జాతీయ స్థాయి అవార్డు



అవార్డు అందుకుంటున్న సైదులు

కోదాడరూరల్ : కోదాడ పట్టణానికి చెందిన సూక్ష్మకళాకారుడు, ఇండియా బుక్ ఆఫ్ రికార్డు గ్రహీత తమలపాకుల సైదులు నార్త్ ఢిల్లీ కల్చరల్ అకాడమీ నేషనల్ అవార్డు అందుకున్నారు. శనివారం హైదరాబాద్‌లో జరిగిన త్యాగరాయగాన సభలో కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి, రిటైర్డ్ న్యాయమూర్తి మధుసూదన్‌లు అవార్డు అందజేశారు.

లారీ బోల్తా



బొల్లంపల్లి సమీపంలో బోల్తాపడిన లారీ

అర్వపల్లి: నకిరేకల్– తానంచర్ల జాతీయ రహదారిపై బొల్లంపల్లి సమీపంలో శనివారం లారీ బోల్తా పడింది. తుంగతుర్తి వైపు నుంచి అర్వపల్లి వైపు బొగ్గు లోడ్‌తో వస్తున్న లారీ బొల్లంపల్లి సమీపంలో అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌తో పాటు అందులో ప్రయాణిస్తున్న వారు తృటిలో తప్పించుకున్నారు.

ప్రేమను పంచుదాం.. క్రమశిక్షణ నేర్పుదాం

- పిల్లల పెంపకంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల పాత్ర కీలకం
- పిల్లలు చెడు దృష్టి వైపు మరలకుండా చూడడం తప్పనిసరి
- శ్రద్ధ వహించకపోతే అనర్థాలే అంటున్న మానసిక వైద్యులు
- నేడు నేషనల్ పేరెంట్స్ డే



సండే స్పెషల్

నల్లగొండ : పిల్లల పెంపకంలో తల్లిదండ్రుల పాత్ర కీలకం. పిల్లలను ప్రేమగా చూసుకోవడంతో పాటు క్రమశిక్షణగా పెంచడం కూడా ముఖ్యమే. పిల్లల శారీరక మానసిక సామాజిక భావోద్వేగ అభివృద్ధికి తల్లిదండ్రులు మార్గదర్శకులుగా ఉండాలి. పిల్లలకు అన్ని సౌకర్యాలు కల్పించడం కాదు వాళ్లకి కావాల్సిందేమిటి, మనం ఇస్తుందేమిటీ అన్న ఆలోచన తల్లిదండ్రుల్లో ఉండాలి. పిల్లల్లో శారీరక, మానసిక మార్పులు జరిగే వయసులో వారిని పెంచడం తల్లిదండ్రులకు చాలెంజింగ్ మారుతుంది. టీనేజర్ పెంపకం కంటే అప్పుడే పుట్టిన శిశువును పెంచడం చాలా తేలికని చాలా మంది సైకియాట్రిస్టుల అభిప్రాయం. హార్మోన్ల వల్ల వాళ్ల మూడ్, ఆటిట్యూడ్, విభిన్నమైన ప్రవర్తనలో మార్పులు వస్తాయి. ఈ హార్మోనల్ మార్పు 13 నుంచి 18 ఏళ్లలోపు జరుగుతుంది. ఇలాంటి సమయంలో వాళ్లకు సరైన సలహా, గైడెన్స్, అటెన్షన్ ఇవ్వడం చాలా అవసరం. టీనేజ్ పిల్లల పట్ల తల్లిదండ్రులు ఎలా మెలగాలో మానసిక వైద్యులు పలు సూచనలు చేశారు.



ఆరేళ్ల వయసులో తల్లిదండ్రులతో కలెక్టర్ ఇలా త్రిపాఠి (ఫైల్)

నాన్న నాతో ఫ్రెండ్లీగా ఉండేవారు

- కలెక్టర్ ఇలా త్రిపాఠి, నల్లగొండ



మా నాన్న నాతో ఫ్రెండ్లీగా ఉండేవారు. జీవితంలో ఎలాంటి సంఘర్షణలు ఎదురైనా కొట్లాడాలని, పోరాడాలని చెప్పేవారు. మా ఇంట్లో నేను మా అక్క ఉండేవారం. చిన్ననాటి నుంచే ఇంట్లో క్రమశిక్షణ నేర్పారు. చదువు మీద ఫోకస్ చేయాలని చెప్పేవారు. ఎప్పుడు అమ్మా నాన్న మా పట్ల కఠినంగా వ్యవహరించలేదు. అంతా క్రమశిక్షణతో ఉండేవాళ్లం. ప్రతి విషయాన్ని నాన్నతో చెప్పేవాళ్లం. తప్పు చేసినా, ఎలాంటి ఆలోచన వచ్చినా దాన్ని నాన్నతో పంచుకునే వాళ్లం. చిన్న నాటి నుంచి నాన్న ఎప్పుడు ఏడవద్దు... ప్రతిదాని పట్ల పోరాట తత్వం ఉండాలని చెప్పేవారు. ఇంట్లో భయంతో ఉంటే బయటకు వెళ్తే ధైర్యంగా ఉండరు. కాబట్టి చిన్న నాటి నుంచే నాన్న ఆ విధంగా పెంచారు. ఇంజనీరింగ్ చదివేప్పుడే యూపీఎస్సీ వైపు ప్రోత్సహించారు. వారు క్రమశిక్షణతో పెంచారు కాబట్టే నేను ఈ స్థాయికి రాగలిగాను.

■ ఎక్కువగా నియంత్రించడం మంచిది కాదు

టీనేజర్స్‌ని మరీ ఎక్కువగా నియంత్రణ చేయడం అంత మంచిది కాదు. కొన్ని విషయాల్లో వారే సొంత నిర్ణయం తీసుకునే స్వేచ్ఛ ఇవ్వాలి. మరీ ఎక్కువగా కంట్రోల్ చేయడం వల్ల తప్పుగా నిర్ణయాలు తీసుకునే ప్రమాదం ఉంది. ముఖ్యంగా టీనేజీలో పిల్లలు శారీరకంగా, మానసికంగా అభివృద్ధి చెందుతారు. కొన్ని విషయాలపై శ్రద్ధ పెట్టడం ముఖ్యం.

■ పిల్లలతో ఓపెన్‌గా ఉండాలి

పిల్లలతో కొన్ని విషయాల్లో ఓపెన్‌గా ఉండాలి. సరైన సలహాలు ఇవ్వాలి. ఉదాహరణకు స్మోకింగ్, డ్రగ్స్, ఆల్కాహాల్ వంటి వాటివల్ల కలిగే హాని గురించి వారికి వివరించాలి.

■ పరిశీలన అవసరం

ప్రతి చిన్న విషయాన్నీ మానిటర్ చేయొద్దు. తెలుసుకోవాలని ఉంటే నేరుగా పిల్లలను అడగాలి. పిల్లల విషయాల గురించి మాట్లాడటానికి సంకోచించొద్దు.

■ కొత్త స్నేహాలు మంచిది కాదని భావించొద్దు

కొత్త స్నేహాలు మంచిది కాదని భావించొద్దు. కొత్తవాళ్లతో పరిచయం అలవాటవ్వాలి. అంతే కాకుండా తన ఫ్రెండ్స్‌ని ఇంటికి తీసుకురమ్మని చెప్పండి. దీనివల్ల స్నేహితులు ఎలాంటి వాళ్లో తెలుస్తుంది.

■ తల్లిదండ్రులు పిల్లలతో కొద్దిసేపైనా కాలక్షేపం చేయాలి

కుటుంబ సభ్యులతో కలిసి టూర్లకు వెళ్తుండాలి. సినిమాలు కలిసి చూడటం, డిన్నర్ ప్లాన్ చేయడం వంటివి తరచుగా చేస్తుండాలి. పిల్లలకు కుటుంబంతో బంధం బలపడటానికి ఇలాంటి సంఘటనలు దోహదపడతాయి.

మా అమ్మానాన్న నాకు ఏదీ వద్దని చెప్పలేదు

- ఎస్పీ శరత్ చంద్రపవార్, నల్లగొండ



తల్లిదండ్రులతో నల్లగొండ ఎస్పీ శరత్ చంద్రపవార్

నా చిన్నప్పటి నుంచి మా అమ్మానాన్న నాకు ఏదీ వద్దని చెప్పలేదు. నాకు క్రికెట్ అంటే ఇష్టం. అందులో ప్రోత్సహించారు. కానీ ఏది చేస్తానన్న వద్దని చెప్పలేదు. చదువు మాత్రం ముఖ్యమని చెప్పారు. ఏది చదవాలనే దానిపై నేనే ముందుకు వెళ్లేలా మా అమ్మానాన్నలు ప్రోత్సహించారు. జీవితంలో పిల్లలకు చదువుతో పాటు ఆటలు ముఖ్యం. తల్లిదండ్రులు ఈ విషయంలో దృష్టి సారించాలి. తల్లిదండ్రులు కూడా పిల్లలను గమనించాలి. పొరపాటు చేస్తే అది కాదు ఇలా అని చెప్పాలి. ప్రస్తుతం పిల్లలకు ఆరోగ్యం ముఖ్యం. దానిపై కూడా జాగ్రత్త వహించాలి. తల్లిదండ్రులు చదువే ముఖ్యమనుకోవద్దు. ఆటలు కూడా ప్రోత్సహించాలి. ప్రస్తుతం చాలా మంది పిల్లలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఆటలను ప్రోత్సహించడం వల్ల పిల్లల్లో ఓటమిని కూడా అంగీకరించే ధైర్యం వారిలో వస్తుంది. నాకు నాలుగు సంవత్సరాల బాబు ఉన్నాడు. కరాటే శిక్షణకు పంపుతున్నా. రెండు సంవత్సరాల పాప ఉంది. ఆమెకు కూడా కరాటే నేర్పుతాను.

“ పిల్లలకు మార్గదర్శకులుగా ఉండాలి



ప్రస్తుత కాలంలో ఉద్యోగ బాధ్యతలో బిజీగా ఉండే తల్లిదండ్రులు పిల్లల పట్ల పెద్దగా శ్రద్ధ వహించలేకపోతున్నారు. మంచి, చెడులు చెప్పే వృద్ధులు కూడా వారికి లేకుండా పోయారు. పిల్లల పెంపకంలో తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయుల పాత్ర కూడా ఉంటుంది. ఇంట్లో తల్లిదండ్రులు, పాఠశాలలో ఉపాధ్యాయులదే బాధ్యత. ప్రస్తుత పరిస్థితుల్లో పరిమితంగా ఒక్కరూ లేదా ఇద్దరు పిల్లలు ఉండడం వల్ల అతి ప్రేమతో గారాబం వల్ల ఏది చేసినా వదిలేస్తున్నారు. దీంతో పిల్లవాడు తాను చేసే పని సరైందనే భావన కలుగుతుంది. పిల్ల వాడు తప్పు చేస్తే ఖండించాలి మంచి చేస్తే మెచ్చుకోవాలి. పిల్లలు చెడు దృష్టి వైపు మరలకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలి. పిల్లలకు మార్గదర్శకులుగా ఉండాలి.

– డాక్టర్ సుబ్బారావు, మానసిక వైద్య నిపుణుడు

ఆరేళ్లలో వంద బైక్‌లు చోరీ

- వాహనాల తనిఖీల్లో పట్టుబడ్డ నిందితుడు



నిందితుడిని, స్వాధీనం చేసుకున్న బైక్‌లను చూపుతున్న సీఐ కొండల్‌రావు

ఆలేరు: గత ఆరేళ్లలో సుమారు వంద బైక్‌ల చోరీకి పాల్పడిన వ్యక్తి శనివారం ఆలేరులో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో పోలీసులకు పట్టుబడ్డాడు. కేసు వివరాలను ఆలేరు పోలీస్‌స్టేషన్‌లో సీఐ కొండల్‌రావు వెల్లడించారు. ములుగు జిల్లా వెంకటాపురం మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన కంప విజయ్(23) చిన్నతనంలోనే అతడి తల్లి మృతి చెందింది. తండ్రి మరో మహిళను పెళ్లిచేసుకున్నాడు. తల్లి బంధువుల వద్ద పెరిగిన విజయ్ వరంగల్‌లో ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో కుకింగ్ పనిచేశాడు. విలాసవంతంగా జీవించాలనే ఆలోచనతో నేరాల బాట పట్టాడు. ఇందుకు సులువుగా డబ్బులు సంపాదించేందుకు చోరీలు చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈక్రమంలో 2019లో ఇంతేజర్‌గంజ్ ఠాణా పరిధిలోని ఓ గుడిలో చోరీకి పాల్పడి జైలు పాలయ్యాడు. జైలు నుంచి విడుదలైన తరువాత బైక్ చోరీలు చేయడం మొదలుపెట్టాడు. ఇలా వరంగల్, మట్వాడ ఠాణాల పరిధిలో బైక్‌లు అపహరించాడు. వాటిని రూ.20–30వేలకు విక్రయించి, వచ్చిన డబ్బులతో జల్సాలు చేశాడు. ఓ దోపిడీ కేసులోనూ విజయ్‌పై మట్వాడ పోలీసులు పీడీ యాక్టు ప్రయోగించారు. ఒక ఏడాదిపాటు జైలులో ఉన్నాడు. విడుదలైన తర్వాత 2022 నుంచి 2023 వరకు ఎనుమాముల, ఇంతేజర్‌గంజ్, మిల్స్ కాలనీ, హనుమకొండ, ఆత్మకూర్‌ల పరిధిలో 54 బైక్‌ల చోరీకి పాల్పడ్డాడు. ఎనుమాముల పోలీసులు 2023లో అరెస్టు చేసి, జైలు పంపించారు. ఈ ఏడాది జూన్ 17న విడుదలైన విజయ్ గత 15రోజుల వ్యవధిలో ఆలేరు, జనగాం, భువనగిరి పట్టణాల్లో మూడు బైక్‌లను అపహరించాడు.

పెంబర్తి నుంచి ఆలేరు వైపు వస్తుండగా..

ఆలేరు హైవేలో శనివారం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. పెంబర్తి నుంచి ఆలేరు వైపు బుల్లెట్, యాక్టీవా వాహనాలపై ఇద్దరు వ్యక్తులు వేర్వేరుగా వస్తున్నారు. ఈ రెండు వాహనాలకు నంబర్ ప్లేట్ లేకపోవడంతో పోలీసులు అనుమానంతో ఆపారు. వాహనాల పత్రాలు చూపించాలని ప్రశ్నించగా అసలు విషయం బయటపడింది. ఆలేరు, జనగాం, భువనగిరిలలో బైక్‌లు చోరీ చేసినట్లు నేరం అంగీకరించడంతో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. విజయ్‌కు సహకరించిన జనగామకు చెందిన మైనర్ బాలుడిని అదుపులోకి తీసుకొని పూచీకత్తుపై పంపించారు. నిందితుడు ఇచ్చిన సమాచారం మేరకు జనగాం సమీపంలోని చెట్ల పొదల్లో దాచిన మరో రెండు చోరీ బైక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో కృషి చేసిన క్రైం కానిస్టేబుళ్లు చంద్రశేఖర్, మహేష్‌లకు సీపీ ఆదేశాల మేరకు సీఐ రివార్డు అందజేశారు.

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

- వరద ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి
- ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి అనితా రామచంద్రన్



సమావేశంలో మాట్లాడుతున్న అనితా రామచంద్రన్

భానుపురి (సూర్యాపేట) : వర్షాకాలంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని మహిళ, శిశు, వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ సెక్రటరీ, ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి అనిత రామచంద్రన్ పేర్కొన్నారు. శనివారం సూర్యాపేటలోని కలెక్టర్ ఛాంబర్‌లో ఖరీఫ్ సీజన్, సీజనల్ వ్యాధులు, వరదలపై తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై కలెక్టర్, అదనపు కలెక్టర్లతో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి అనితా రామచంద్రన్ మాట్లాడుతూ.. శిథిలావస్థలో ఉన్న భవనాలు గుర్తించి వాటిని తొలగించాలని సూచించారు. కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ మాట్లాడుతూ.. వరదలపై కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. పులిచింతల వెనుక జలాల్లో ముంపు గ్రామాలకు పునరావాసం ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. అదేవిధంగా ఇరిగేషన్, వ్యవసాయ, పశుసంవర్థక, వైద్యారోగ్య అధికారులు, సివిల్ సప్లయ్ అధికారులు తమ శాఖ పురోగతిని తదితర అంశాలను వివరించారు. సమావేశంలో పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి, ఇరిగేషన్ డీఈలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక విద్య, నాణ్యమైన పోషకాహారం అందించాలి

అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్య, నాణ్యమైన పోషకాహారం అందించాలని మహిళ, శిశు,వయోవృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ సెక్రటరీ అనితా రామచంద్రన్ పేర్కొన్నారు. శనివారం కలెక్టర్ ఛాంబర్‌లో మహిళ శిశు దివ్యంగులు వయోవృద్ధుల అధికారులతో కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్‌తో కలిసి ప్రత్యేక అధికారి అనిత రామచంద్రన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ.. అంగన్‌వాడీల్లో పిల్లల హాజరు పెంచాలని, బాలింతలు, గర్భిణులు పోషకాహారం తీసుకునేలా ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించాలని తెలిపారు. పోషకాహారం తీసుకుంటనే కడుపులోని బిడ్డ ఆరోగ్యకరంగా పెరుగుతాయరని పేర్కొన్నారు. సమావేశంలో డీడబ్ల్యూఓ దయానందరాణి, డీసీపీఓ రవి, సీడీపీఓలు, సూపర్ వైజర్లు, సఖి, మహిళా సాధికారత కేంద్రం, పోషణ్ అభియాన్ అధికారులు పాల్గొన్నారు.

ఎయిమ్స్‌లో ఎలక్ట్రిక్ వాహన సేవలు ప్రారంభం



ఎలక్ట్రిక్ వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎయిమ్స్ డైరెక్టర్ శాంతాసింగ్

బీబీనగర్: బీబీనగర్ ఎయిమ్స్ వైద్య కళాశాలలో వైద్యులు, రోగుల అవసరాల రీత్యా ఏర్పాటు చేసిన ఎలక్ట్రిక్ వాహనాలను శనివారం ఎయిమ్స్ డైరెక్టర్ అహంతెం శాంతాసింగ్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలక్ట్రికల్ వాహనాల ద్వారా ఎయిమ్స్ క్యాంపస్‌లోని అకాడమిక్, ఆస్పత్రి భవనాల మధ్యన రాకపోకలకు, రోగుల వైద్య సామగ్రి తరలింపు కోసం స్వచ్ఛ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఈ వాహనాలను సమకూర్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎయిమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ రాహుల్ నారంగ్, డిప్యూటీ డైరెక్టర్ వర్గీస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రియుడి ఇంటి ఎదుట ధర్నా

కోదాడరూరల్ : తనతో సహజీవనం చేసి పెళ్లికి నిరాకరిస్తున్నాడని మహిళ శనివారం ప్రియుడి ఇంటి ఎదుట ధర్నాకు దిగింది. నడిగూడెం మండల రత్నవరం గ్రామానికి చెందిన అనూషకు ఏడేళ్ల కిందట అదే మండలంలోని చాకిరాలకు చెందిన వ్యక్తితో వివాహం జరిగింది. ఆ తర్వాత అతడితో విడిపోయింది. ఈక్రమంలో కొమరబండకు చెందిన మహేష్‌తో పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది. ఇద్దరూ కలిసి కోదాడలో నివాసం ఉంటూ సహజీవనం చేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమార్తెలు కూడా ఉన్నారు. ఇటీవల మహేష్ ఆమెను దూరం పెడుతూ మరో పెళ్లి చేసుకునేందుకు సిద్ధం అవుతున్నాడు. దీంతో సదరు మహిళ తనను పెళ్లి చేసుకోవాలని కొమరబండకు వెళ్లి ఆ యువకుడి ఇంటి ఎదుట ధర్నాకు దిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికు చేరుకుని స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని తెలపడంతో తనకు న్యాయం జరిగే వరకు ఇక్కడే ఉంటానని ఇద్దరి పిల్లలతో కలిసి భీష్మించుకుని కూర్చుంది.

నీటి సంపులో పడి వ్యక్తి మృతి

వలిగొండ : ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన వలిగొండ మండలంలోని జాలుకాల్వ గ్రామంలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా కాకునూరు మండలం బోడిపాలెం గ్రామానికి చెందిన కనికాటి వీరేంద్రచౌదరి (27) జాలుకాల్వలోని దివీస్ ల్యాబొరేటరీకి చెందిన మాన్‌పవర్ వాటర్ సంపు వద్ద రెండు సంవత్సరాల నుంచి వాటర్‌మన్ గా విధులు నిర్వహిస్తున్నాడు. మోటార్‌పంప్ మరమ్మతులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలుజారి సంపులో పడి మృతి చెందాడు. తోటి సిబ్బంది గమనించి అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడకు చేరుకుని సంపులో నీటిని తోడి మృతదేహాన్ని శుక్రవారం రాత్రి బయటకు తీశారు. మృతుడి తండ్రి శ్రీనివాస్‌రావు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్సై యుగంధర్ తెలిపారు.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి

భువనగిరి, బీబీనగర్: రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన శనివారం భువనగిరి మండల పరిధిలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి–పగిడిపల్లి రైల్వే స్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి రైలు కింద పడి మృతి చెంది ఉండడంతో సమాచారం అందుకున్న రైల్వేపోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి వయస్సు సుమారు 50 సంవత్సరాలు ఉంటుందని, రైలులో నుంచి ప్రమాదవశాత్తు జారి పడి ఉండవచ్చని భావిస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని జిల్లా కేంద్ర ఆస్పత్రిలోని మార్చురీలో భద్రపర్చినట్లు చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు 98482 22169ను సంప్రదించాలని భువనగిరి రైల్వే పోలీస్ ఇన్‌చార్జ్ కృష్ణారావు తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

పెద్దవూర: ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీ కొని వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం పెద్దవూర మండల పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హాలియాకు చెందిన నెర్మటి మధుసూదన్‌రెడ్డి (55) శనివారం తన సమీప బంధువుల ఫంక్షన్‌కు బైక్‌పై వెళ్లాడు. తిరిగివస్తుండగా హాలియా నుంచి పెద్దవూర వైపు వెళ్తున్న సిమెంట్ లోడ్ లారీ అతివేగంతో మధుసూదన్‌రెడ్డి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో అతడి తలకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం నాగార్జునసాగర్ కమలానెహ్రూ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగార్జునసాగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

కుటుంబ కలహాలతో ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఆత్మహత్య



అనిల్ (ఫైల్)

డిండి: కుటుంబ కలహాలు, ఆర్థిక సమస్యల కారణంగా ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన డిండి మండల కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. సూర్యాపేట జిల్లా నాగారం మండల కేంద్రానికి చెందిన జె.అనిల్ (53) డిండి పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా విధులు నిర్వహిస్తున్నాడు. ఈయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉంది. వీరు సూర్యాపేటలో నివాసం ఉంటుండగా, అనిల్ ఒక్కడు డిండిలోని బస్టాండ్ సమీపంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. గత కొంత కాలంగా కుటుంబ కలహాలు, ఆర్థిక సమస్యలు వేధిస్తున్నాయి. ఈనెల 22 నుంచి సెలవులో ఉన్న అనిల్ డిండిలోని అద్దె ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. చుట్టు పక్కల వారు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండకు తరలించినట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు.

చోరీ కేసులో నలుగురు అరెస్టు

మిర్యాలగూడ అర్బన్: చోరీ చేసిన వాటర్ ట్యాంక్ వాల్వ్‌ను అమ్మేందుకు ఆటోలో తీసుకెళ్తుండగా నలుగురు నిందితులను శనివారం వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. కేసు వివరాలను వన్‌టౌన్ సీఐ మోతీరామ్ వెల్లడించారు. మిర్యాలగూడ పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన కేదారి కోటేష్, కత్తుల సాయికుమార్, ఉబ్బపల్లి వేణు, ఈగల రాకేష్ ఈ నెల 23న రాత్రి పట్టణంలోని పాతమార్కెట్ యార్డ్‌లో ఉండే వాటర్‌ట్యాంక్ వాచ్‌రూంలో ఉన్న రూ.80వేలు విలువ చేసే పాత వాటర్ ట్యాంక్ వాల్వ్‌ను ఆటోలో తీసుకెళ్లి మార్కెట్ యార్డ్‌లో గల కంప చెట్లలో దాచి పెట్టారు. దానిని పాత ఇనుప సమాను షాపులో విక్రయించేందుకు శనివారం ఆటోలో తీసుకువెళ్తున్నారు. రాజీవ్‌చౌక్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులకు అనుమానం రావడంతో ఆటోను ఆపి వివరాలు అడిగారు. పొంతనలేని సమాధానం చెప్పడంతో అది చోరీ చేసిన వస్తువుగా గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ చేశారు. వారు నేరం అంగీకరించడంతో నలుగురిని అరెస్టు చేశారు. వాటర్ ట్యాంక్ వాల్వ్, ఆటోను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్ఐ సైదిరెడ్డి, హెడ్ కానిస్టేబుల్ దైద సైదులు, కానిస్టేబుల్ సీహెచ్.వెంకటేశ్వర్లు, బి.ప్రసాద్ తదితరులున్నారు.